తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన రచన!

# గొప్పమనసు!

ఎ.రంగ

పద్నాలుగు సంవత్సరాల లోపు వయస్సు వాడికి, ఈ దేశంలో పుట్టిన నేరానికి, ఆ వయస్సులోని అందరి పిల్లల్లా అమ్మ వండి పెడితే తిని, స్కూలు డ్రెస్ వేసుకుని, పుస్తకాల 'బేగ్' తగిలించుకుని, హాయిగా ఆడుతూ, పాడుతూ స్కూలుకి వెళ్ళే అదృష్టంకాని, హక్కుగాని లేవు. కాని మామిడి తోటకు, రోడ్డుకు మధ్యనున్న జాగాలో మట్టు గుడిసెలో 'చావు' లాంటి పడక మీద ఎప్పుడూ మృత్యువునంటిపెట్టుకు నుండే తల్లిని, పది సంవత్సరాల తమ్ముడిని పోషించే బాధ్యత మాత్రం వాడిమీద వుంది.

వాడి బుద్ధి సోమరి బుద్ధికాదు. శరీరం మాత్రం పనికి అనుకూలించదు. పూతన పుల్ల వంటి ఎండు శరీరం. మాసిన గుడ్డలు. ఎండిన జుట్టు, బస్సు స్టాండులలో గడిపేవాడు. పాసింజర్ల సామాన్లు మోసి, పైసలు గడిద్దామని.

బరువులు మోస్తానని పాసింజర్ల వద్దకు వెళితే- "నిన్ను నమ్మి బరువులు పెడితే మా పని గోవింద. కూలిచ్చి గుద్దించుకున్నట్లే! నువేం మోస్తావురా, నీ మొహం. వెళ్ళువెళ్ళు." అంటూ కసిరిపారేస్తూ వుండేవారు.

"కిర్సనాయిల్ డబ్బా మోస్తావా? ఆర్.ఎస్.డి. నుంచి క్వార్టర్సుకు 20 పైస లిస్తాను. డబ్బా గనక ఎత్తేసావా, బుర్రపగిలి పోతుంది. జాగ్రత్తగా పట్టుకు వెళ్ళాలి మరి." ...అన్నాడొక మానవుడు కిర్సనాయిల్ డిపో దగ్గర కాస్తే.

విసిగి హోటలు చూసుకున్నాడు. ఓరోజు హోటల్‌లో చేతుల్లోంచి గాజుగ్లాసులు జారి బద్దలయిపోయేయి. నియంతలాంటి ఆ హోటల్ ప్రొప్రయిటరు-

"నీలాంటి వాళ్ళ పెట్టుకుని నష్టాలు భరించలేం. మాకొచ్చే డబ్బులికి. నీకు, నీపనికి ఓనమస్కారం. పోపో." అంటూ చెవులు మెలేసి, తన్ని మరీ తగిలేసేడు.

కడుపులో ఆకలి మంటలు. వాటిని చల్లార్చాలి అందుకే 'ముష్టివాడు'గా మారేడు.

ఆ ముష్టి కుర్రవాడు తోటకు తమ నివాసానికి అవతలివైపునున్న గవర్నమెంటువారు కట్టిన క్వార్టర్సు వైపు రాత్రి తొమ్మిది దాటిన తర్వాత అడుక్కోనేందుకు వెళ్ళేవాడు.



అవి నాలుగు వరసల క్వార్టర్సు. రెండవ వరుసకి ఎక్కువ వెళ్ళేవాడు. మిగతా వరుసలకు వెళ్ళినా పెద్ద ప్రయోజనం ఉండేది కాదు. ఎందుచేతనంటే, కామేశ్వరమ్మ, సుందరమ్మ-మీనాక్షమ్మల్లాంటి వారు - "రోజూ వస్తే ఎక్కడరా? కరువుకాలం. మా పిల్లలకే కడుపు నిండా అన్నాలు పెట్టలేకపోతున్నాం! ధరలు మండిపోతున్నాయి. ఏదైనా పని చూసుకోవాలి గాని-ఎన్నాళ్ళు అడుక్కుంటే గడుస్తుంది" అనే వారే.


రెండవ వరుసలోని మొదటి బ్లాకు 'బి' యూనిట్‌లో వుంటున్న రాధమ్మ మాత్రం అలా అనదు. అనలేదు. అలా అంటే రాధమ్మకు మిగతా వారికి భేదం వుండదు. రాధమ్మ రాధమ్మే కాబట్టే అనదు.

అయితే రాధమ్మ భర్తకు ఎక్కువ జీతం. తక్కువ సంతానం కలది కాదు. నలుగురు పిల్లలు. ఈ ఆరుగురు రెండు పూటలా తిని లేవాలి. అయినా మిగులూ, తగులూ జాగ్రత్తగా మూతలు పెట్టి, 'కూకంత గంజుంటే పోయండమ్మా! దయగల తల్లులూ!' అంటూ గుండె లోతుల్ని స్పందింపజేస్తూ, రాత్రి తొమ్మిది దాటిన తర్వాత మాత్రమే వచ్చే ఆ ముష్టి కుర్రవాడికి వేస్తూ వుండేది.

ఒక రోజు ఆ కుర్రాడు ఓ పెద్ద మామిడి కాయ తెచ్చేడు. దానిని చూస్తూనే, "ఎక్కడిదిరా"? అనుమానంగా అడిగింది రాధమ్మ.

"రావులమ్మ తోట పొద్దంతా కాపలా కాసి నానమ్మా! ఈ కాయ ఇచ్చినాది. పప్పులో ఏసుకోండమ్మా! మీగురించే తెచ్చినానమ్మా!" అంటూ అభిమానంగా రాధమ్మకు ఇవ్వబోయేడు.

రాధమ్మ పుచ్చుకోలేదు. కాని రాధమ్మ మనసు మాత్రం విచిత్రంగా, చిత్రంగా, స్పందించింది. వాడి అభిమానానికో! కృతజ్ఞతకో!



"మీ అమ్మకివ్వు వండిపెడుతుంది." అంది రాధమ్మ.

"మాయమ్మ పొయ్యి కాడకెల్లి వంట సేయనేదమ్మా! జబ్బు." అన్నాడు.

"అయితే నువు, మీ తమ్ముడు కోసుకుతినండి." అంది రాధమ్మ. లోపలకు వెళుతూ. గిన్నెలో వుంచిన మిగిలిన రెండు రొట్టెలూ, కూర తెచ్చి వాడిగిన్నెలో వేసింది.

"అమ్మగారూ! తీసుకోండి." అన్నాడు మళ్ళా ప్రాధేయపూర్వకంగా.

"వద్దంటుంటే నీక్కాదూ చెపుతూంట, విసిగించకు. నాకిష్టముండదు ఇటువంటివి." అంటూ విసుక్కుంది.

వాడు వెళ్ళిన తర్వాత తలుపులు వేసుకోవచ్చుననుకుంటూ లోపలకు వెళ్ళింది. ఈ లోపున మామిడి కాయ గుమ్మంలో పెట్టేసి పరుగున వెళ్ళి పోయేడు ముష్టి కుర్రాడు.

రాధమ్మ తలుపులు వేద్దామని వచ్చేసరికి గుమ్మంలో కాయవుంది. తీసి తలుపులు వేసి వచ్చి, పిల్లలకు కనపడకుండా భద్రంగాదాచింది.

మర్నాడు సాయంత్రం భర్త, ...బా సినిమాకు వెళుతూ రాధమ్మని రమ్మన్నారు. కాని రాధమ్మ రాననేసింది.

ఫస్టు షోకి వెళ్ళేరు. స్థిమితంగా వంట చేయచ్చు అనుకుంది రాధమ్మ, ఓస్టవ్‌మీద పప్పు, ఓస్టవ్ మీద ఎసరూ పడేసి, మామిడి కాయ పప్పు, అన్నం, అప్పడాలు, చారూ తో వంట పూర్తి చేసింది. పప్పు, అన్నం, ఎక్కువగా వండింది. ఓ గిన్నెలోకి పప్పు, ఓ గిన్నెలోకి అన్నం కొంచెం ఎక్కువగానే తీసి మూతలు పెట్టింది. అలా తీస్తున్నప్పుడు పాపం ఏదో 'ఆశ' చప్పవో, అభిమానం చప్పవో మామిడికాయ ఇచ్చేడు. అడుక్కు తెచ్చుకున్న గింజలనైనా వండి పెట్ట లేని స్థితిలో వున్న తల్లి, జాలిగా, సానుభూతిగా నిట్టూర్చింది రాధమ్మ.

పని ముగించుకుని వీధి వరండాలో లైటు వేసుకుని బల్లమీద పుస్తకం చదువుకుంటూ కూర్చుంది రాధమ్మ. టైముగడుస్తోంది, రోజూ వచ్చే ముష్టి కుర్రాడు రాలేదు. లోపలకు వెళ్ళి టైము చూసి వచ్చింది. తొమ్మిది దాటి పోయింది కాని వాడు రాలేదు. పదవుతుంటే భర్తా, పిల్లలూ వచ్చేరు, సినిమా నుంచి. కాని వాడు రాలేదు.

"మాకోసం కూర్చుండి పోయేవా? మేము పెట్టుక్కు తినేద్దుముకదా! నువు భోజనం చేసి పడుకోవలసింది." అన్నాడు భర్త. రాధమ్మకు అవేమీ వినిపించలేదు. యాంత్రికంగా లేచి భర్తకు పిల్లలకు అన్నాలు పెట్టింది.

తనూ కొద్దిగా తిన్నాననిపించింది. ఖాళీ అయిన గిన్నెలన్నీ, గిన్నెలు తోముకునే తూము దగ్గర పడేసింది. వంటగది కడుగుతుంటే ముష్టి కుర్రాడి కోసం మూతలు పెట్టిన పప్పుగిన్నె, అన్నంగిన్నె తనని చూసి, కాదు, తనలోని మానవతను చూసి, వెక్కిరించి నట్లనిపించింది. కాని వాడి కోసం వుంచిన గిన్నెలు 'ఆశ' వుండేవమోనన్న తనలోని భావాన్ని 'సిగ్గు' పరుస్తున్నట్లుగా వుండిపోయేయి.

లోకంలో మానవతను మించిన మహత్తర విషయం మరేమీ లేదనేదే తనకు తెలిసిన విషయం. కాని అంతకుమించిన గొప్పతనం కూడా మరేదో వుందనిపించింది. అదేమిటో భాషకు అందకుండా, అంతుపట్టకుండా వుంది రాధమ్మకు. రోజూ వచ్చే ఆ ముష్టి కుర్రాడు ఎందుకు రాలేదో, అర్ధంగాకుండా, అస్పష్టంగా వుండి పోయింది రాధమ్మకు. మీరేమంటారు?





## స్వపరిచయం

నిజానికి నాగురించి రాయటానికి ఏమీలేదు. పుట్టి పెరిగింది పశ్చిమగోదావరి జిల్లా లోని గూటాల గ్రామంలో. ప్రస్తుతం ఉంటున్నది విశాఖపట్టణంలో. చదువు బి.ఎ.

అప్పుడప్పుడు మాత్రం చిన్న చిన్న కథలు, వ్యాసాలు రాస్తూంటాను. నిజ జీవితంలో గుండెల్ని పిండే సమస్యల్ని తీసుకుని రాయాలన్నది ధ్యేయం.

శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారి రచనలు మరీ మరీ ఇష్టం.

— ఎ.రంగ

